AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

13-10-2026 (Tuesday)

MAIN EDITION

ఎండీఆర్ ఛార్జీల అమలు వాయిదా



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: కేంద్ర ప్రభుత్వం వ్యాపారులకు గుడ్ న్యూస్ చెప్పింది. యూపీఐ పేమెంట్లపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) ఛార్జీల అమలు వాయిదా వేసింది. ఈ నెల 15 నుంచి 0.4 శాతం ఎండీఆర్ వసూలు చేస్తామని గతంలో తెలిపిన విషయం తెలిసిందే. దసరా, దీపావళి నేపథ్యంలో వ్యాపారులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈ నిర్ణయాన్ని వాయిదా వేసింది. దీపావళి తర్వాత ఛార్జీల వసూలు అమలు చేస్తామని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తెలిపింది.

హైదరాబాద్‌లో భారీ అగ్ని ప్రమాదం



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ: హైదరాబాద్ నగరంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. తప్పాచబుత్ర పోలీస్ స్టేషన్ పరిధిలోని దత్తాత్రేయ నగర్‌లో ఉన్న సయ్యద్ అలీకి చెందిన ఫర్నిచర్ గోదాములో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆరు అగ్నిమాపక యంత్రాలతో మంటలను ఆర్పివేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

టీజీ సేఫ్ అధికారుల దాడులు



అక్షరటుడే, నల్గొండ: సూర్యాపేట జిల్లా చిట్యాలలోని 7 మిడ్‌వే ప్లాజాపై టీజీ సేఫ్ అధికారులు మంగళవారం దాడులు చేశారు. అక్కడ అపరిశుభ్రమైన పరిస్థితులు, బొద్దింకలు, ఈగల సంచారం కనిపించాయి. తనిఖీ సమయంలో తుప్పు పట్టిన యంత్రాలు, అలాగే పురుగులు పట్టిన ముడి సరుకులు కూడా బయటపడ్డాయి.

ఐపీఎస్ అధికారిపై కేసు నమోదు



అక్షరటుడే, ఏపీ: ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి, కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. బెంగళూరులోని ఒక పబ్‌లో పోలీసు సిబ్బందితో ఆయన గొడవ పడ్డట్లు ఆరోపణలు వచ్చాయి. ఇన్‌స్పెక్టర్ అరుణ్ సలుంకే ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదైంది.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు కోసం టీపీసీసీ పరిశీలకుల నియామకం

అక్షరటుడే, హైదరాబాద్ సిటీ: పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు నియోజకవర్గాలకు పరిశీలకులను నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. అర్హులైన పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రజలను అణచివేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ : పొంగులేటి



అక్షరటుడే, ఖమ్మం: ప్రజలను అణచివేయడంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే అని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసన తెలిపే జాబితా నుంచి తొలగించిన విషయం తెలిసిందే. దీనిపై పొంగులేటి స్పందించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ లాగే, కేంద్రంలో బీజేపీని కూడా ప్రజలు బొందపెడుతారన్నారు. మొన్న పేపర్ లీక్స్...నిన్న ప్రజల నిరసన హక్కును హరించడం...ప్రజా వ్యతిరేక చర్యల్లో బీజేపీ తన బీటీం బీఆర్ఎస్‌నే అనుసరిస్తోందని విమర్శించారు.



సింగరేణి కార్మికులకు దసరా బోనాంజ

సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. దసరా సందర్భంగా బోనస్‌ను ప్రకటించింది. సంస్థ లాభాల్లో 34 శాతం దసరా బోనస్‌గా ఇస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఒక్కో కార్మికుడికి రూ.1.53 లక్షలు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు రూ.5,500 బోనస్ ఇస్తామన్నారు. అంతేగాకుండా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

- ఒక్కొక్కరికి రూ.1.53 లక్షల బోనస్
- కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,500
- బోనస్ ప్రకటించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంగళవారం బోనస్ వివరాలు ప్రకటించారు. శాశ్వత ఉద్యోగులకు లాభాల్లో 34 శాతం బోనస్ రూపంలో చెల్లిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న 250-300 డిపెండెంట్ ఆర్డర్లను 15 రోజుల్లో పూర్తి చేస్తామని ప్రకటించారు. సింగరేణి కార్మికుల మారుపేర్ల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సింగరేణి భూముల్లో అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ చేస్తామన్నారు. కలెక్టర్లు, సింగరేణి అధికారుల కమిటీ నెల రోజుల్లో అర్హుల జాబితా సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు.

నెహ్రూ హౌసింగ్ కాలనీ ఏర్పాటు

సింగరేణి భూముల్లో కార్మికుల ఇళ్ల నిర్మాణాల కోసం నెహ్రూ హౌసింగ్ కాలనీలను ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. శిథిలమైన క్వార్టర్ల స్థానంలో కొత్తవి నిర్మిస్తామని పేర్కొన్నారు. సింగరేణి ఏరియా ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేయాలని ఆదేశించారు. సింగరేణి ప్రాంతంలోని గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. వినియోగంలో లేని భూములు, ఓబీ గుట్టలపై సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రతి ఆరు నెలలకు కార్మికులకు భద్రతా కిట్ల పంపిణీ చేయాలని సూచించారు.

రామగుండంలో థర్మల్ విద్యుత్ కేంద్రం

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రామగుండంలో సింగరేణి ఆధ్వర్యంలో థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. కార్మికుల ఆదాయపన్నును సంస్థ నుంచే ప్రభుత్వానికి చెల్లించేలా ఆదేశాలు జారీ చేస్తామన్నారు. సత్తుపల్లి, భూపాలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలల మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయిస్తామని పేర్కొన్నారు.



మహిళా జర్నలిస్ట్‌ను తోసేసిన రాహుల్ గాంధీ!

అక్షరటుడే, ఢిల్లీ: లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై మహిళా జర్నలిస్ట్ సంచలన ఆరోపణలు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై నిన్న సుప్రీంకోర్టు ప్రాంగణంలో నిరసన సమయంలో గర్భిణి అయిన తనను రాహుల్ గాంధీ తన చేతిని తోసి, లాగారని మహిళా జర్నలిస్ట్ ఆరోపించారు. వన్‌ఇండియా వెబ్‌సైట్‌కు చెందిన రిచా పరాశర్ ఈ మేరకు రాహుల్ గాంధీ ఆరోపణలు చేశారు. రాహుల్ గాంధీ తనను గట్టిగా లాగారని ఆమె పేర్కొన్నారు. దీంతో తన మోకాళ్లు, పొట్ట గట్టి నేలకు తగిలి కింద పడిపోయానని ఆరోపించారు. కాగా ఈ ఆరోపణలను కాంగ్రెస్ ఖండించింది.

ఉచిత విద్యుత్‌కు ఎసరు పెట్టే కుట్ర : హరీశ్‌రావు



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ: రైతు డిస్కమ్ పేరుతో ఉచిత విద్యుత్‌ను ఎత్తేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. రైతు డిస్కమ్ ఏర్పాటు చేస్తూ జారీ చేసిన జీవోను ఆయన ఖండించారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ నిలిపివేసి, రైతు మెడకు ఉరేసేందుకేనా ఈ కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. వ్యవసాయానికి, గృహాలకు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా చేయలేకపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు రైతు డిస్కమ్ పేరుతో మరో డ్రామాకు తెర తీసిందని మాజీ మంత్రి విమర్శించారు. ఈ డిస్కమ్‌తో రైతులకు జరిగే ప్రయోజనం ఏమిటో చెప్పాలని నిలదీశారు. ప్రభుత్వ తీరుతో రైతులు మరింత ఇబ్బందులు పడుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ వైపు పంటలు ఎండిపోయి రైతులు కన్నీరు పెడుతుంటే పట్టించుకోని ప్రభుత్వం.. ఉచిత విద్యుత్‌పై చేతులెత్తేసేందుకే రైతు డిస్కం తెచ్చిందన్నారు.

వేంకటాద్రి యాప్‌తో తిరుమల సమాచారం



అక్షరటుడే, తిరుమల: తిరుమలకు వచ్చే భక్తులకు సమగ్ర సమాచారం, మెరుగైన సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వేంకటాద్రి యాప్‌ను ప్రారంభించినట్లు టీటీడీ ఐటీ జీఎం వేంకటేశ్వర్లు నాయుడు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం టీటీడీ విస్తృతంగా ఐటీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిందని చెప్పారు. దర్శన క్యూలైన్ల నిర్వహణను ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

ఎల్‌బీ నగర్ –హయత్‌నగర్ కారిడార్‌కు కేంద్రం ఆమోదం



అక్షరటుడే, హైదరాబాద్: ఎల్‌బీ నగర్, హయత్‌నగర్ డబుల్‌డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ ఆమోదం తెలిపారు. మంగళవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఢిల్లీలో గడ్కరీని కలిశారు. కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జ్ శంకుస్థాపన ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. ఎన్‌హెచ్ 765పై ఎలివేటెడ్ కారిడార్ డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులను గడ్కరీ ఆదేశించారు.

సీజేపీ నాయకుల అరెస్ట్



అక్షరటుడే, ఢిల్లీ: జంతర్ మంతర్‌ను నిరసన ప్రదేశం హోదా నుండి కేంద్రం తొలగించిన విషయం తెలిసిందే. దీంతో సీజేపీ నాయకులు మంగళవారం ఉదయం జంతర్ మంతర్ వద్ద ఆందోళనకు యత్నించారు. అశుతోష్ రంకా, సౌరవ్ దాస్ నేతృత్వంలో కార్యకర్తలు జంతర్ మంతర్‌కు వచ్చారు. ఇనుప గేటు, పోలీసు బారికేడ్లను ఎక్కి లోపలికి వెళ్లారు. అనంతరం ఢిల్లీ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

గ్రామస్థుల దాడిలో మాజీ ఎమ్మెల్యే మృతి



అక్షరటుడే, రాజస్థాన్: రాజస్థాన్‌లోని భోండా గ్రామస్థులు చేసిన మూక దాడిలో బీజేపీ మాజీ ఎమ్మెల్యే అత్తర్ సింగ్ మరణించారు. ఆయన గడ్డి భూములను ఆక్రమించి తవ్వకాలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో మూసేసిన స్టోన్ క్రషర్ను తిరిగి ప్రారంభించడంతో ధర్నా చేస్తున్నారు. తాజాగా అత్తర్ తన అనుచరులతో కలిసి వారిని ఖాళీ చేయించడానికి ప్రయత్నించారు. దీంతో జరిగిన గొడవలో ఆయన గాయపడ్డారు. చికిత్స పొందుతూ మృతి చెందారు.

కదులుతున్న రైలు ఎక్కుతూ పడిపోయిన వ్యక్తి



అక్షరటుడే, కాచిగూడ: హైదరాబాద్ నగరంలోని కాచిగూడ రైల్వే స్టేషన్‌లో తృటిలో ప్రమాదం తప్పింది. ఓ వ్యక్తి తన కుమార్తెతో కలిసి రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. అతడు విశాఖ ఎక్స్‌ప్రెస్ ఎక్కాల్సి ఉంది. అయితే రైలు కదలడం ప్రారంభించడంతో అతను తన కూతురిని ఎత్తుకొని పరిగెత్తుతూ వెళ్లి రైలు ఎక్కే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో కాలు జారడంతో కింద పడిపోయాడు. గమనించిన ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ రీనా కుమారి వెంటనే స్పందించారు. వారిని సురక్షితంగా బయటకు లాగారు. లోకో పైలట్ అత్యవసర బ్రేకులు వేసి రైలును నిలిపివేయడంతో ఘోర ప్రమాదం తప్పింది.

అక్రమాస్తుల కేసులో ఏసీబీకి కస్టడీకి లక్ష్మీ భాస్కర్



అక్షరటుడే, హైదరాబాద్: అక్రమాస్తుల కేసులో అరెస్టయి సస్పెండ్ అయిన నిమ్స్ అదనపు వైద్య సూపరింటెండెంట్ లక్ష్మి భాస్కర్‌ను ఏసీబీ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. రిమాండ్‌లో ఉన్న ఆయనను కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ అధికారులు కోర్టును ఆశ్రయించారు. ఆయనను మూడు రోజుల కస్టడీకి కోర్టు అనుమతిచ్చింది. ఆయన వద్ద రూ. 100 కోట్లకు పైగా విలువైన ఆస్తులను ఏసీబీ అధికారులు గుర్తించారు.